సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 17 । మార్చి । 2023



జీసీసీలో గోల్‌మాల్

గిరిజన సహకార సంస్థ (జీసీసీ)పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో అవినీతి, అక్రమాలు సర్వసాధారణమయ్యాయి. 10లో



అకాల వర్షంతో ఆగమాగం..

జిల్లాలో గురువారం పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. పంటలు దెబ్బతిన్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 20°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కల్యాణం.. కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం రామాలయంలో గురువారం శ్రీసీతారామ చంద్రస్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం ఘనంగా పూజలు జరిపారు. శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ పాల్గొన్నారు

రేపు హుండీ కానుకల లెక్కింపు

శ్రీకనకదుర్గ ఆలయంలో ఈ నెల 18న హుండీ కానుకల లెక్కింపు జరపనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, నవంబర్ 28 నుంచి ఈ నెల 17వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

దిశ సమావేశం వాయిదా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఐడీఓసీలో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు నిర్వహించ తలపెట్టిన దిశ కమిటీ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు కలెక్టర్ అనుదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సమావేశం ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్, శాసనమండలి, శాసనసభ సభ్యులు, ఎంపీపీలు, దిశ కమిటీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

పాల్వంచ: ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లు ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష సూచించారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశ వర్కర్ల ఫెసిలిటేటర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మాతా, శిశు సంరక్షణకు కృషి చేయాలని, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులు గమనిస్తూ ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు పొందేలా చూడాలని చెప్పారు. 2025లోగా టీబీ నివారించేందుకు కృషి చేయాలని సూచించారు. దోమల నివారణ, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ సుకృత, శ్రీనివాస్, మణికంఠా రెడ్డి, పర్షానాయక్, బాలాజీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చుట్టపు చూపేనా..?

జిల్లాపై మహబూబాబాద్ ఎంపీ కవిత శీతకన్ను

- ఆమె 'పార్లమెంట్' పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు
- అభివృద్ధికి నిధులు తేలేకపోతున్నారనే విమర్శలు
- రామయ్య దర్శనం, సీఎం పర్యటనలకే పరిమితం
- ఎంపీ తీరుపై పార్టీ వర్గాల్లో పెరుగుతున్న అసంతృప్తి



మహబూబాబాద్ ఎంపీ కవిత

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత జిల్లాకు సంబంధించిన అంశాలపై అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సమన్వయం తదితర అంశాల్లో ఎంపీ పనితీరు అనేక విమర్శలకు దారితీస్తోంది.

ఆమె పరిధిలోనే సగం జిల్లా

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. స్వతహాగా పూర్వ వరంగల్ జిల్లా రాజకీయాల ముఖ చిత్రంపై కవిత సుపరిచిత వ్యక్తి. మహబూబాబాద్ నుంచి ఎంపీ అయ్యాక తొలిసారిగా భద్రాద్రి జిల్లా రాజకీయాలతో పరిచయమయ్యారు. క్రమంగా ఇక్కడి నేతలతో మమేకమయ్యారు. ముఖ్యంగా ఇల్లెందు నియోజకవర్గంపై ఆసక్తి చూపేవారు. ఇల్లెందు రైల్వే స్టేషన్ పునఃరుద్ధరణ కోసం ప్రయత్నం చేశారు. మహబూబాబాద్ – ఇల్లెందు – కొత్తగూడెం రోడ్డుకు జాతీయ రహదారి హోదాను సాధించి పెట్టారు. మొత్తంగా ఎంపీగా ఎన్నికైన తర్వాత నుంచి కరోనాకు ముందు వరకు భద్రాద్రి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన మార్క్ కనిపించేలా పని చేసేందుకు ఎంపీ ప్రయత్నించారు.

నిధుల విషయంలో పట్టింపు లేనట్టుగా..

కరోనా తర్వాత జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి, ఇక్కడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎంపీగా జిల్లాకు తీసుకురావాల్సిన నిధుల విషయంలోనూ అంటీ ముట్టనట్టుగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్వదినాల్లో భద్రాచలం రామయ్య దర్శనం, సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనల్లో పాల్గొనడం, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్‌కు కూతురు పుట్టినప్పుడు ఈ జిల్లాకు చుట్టపు చూపుగా వచ్చారనే విమర్శలు వస్తున్నాయి.

మొక్కుబడిగా..

అటు ప్రజాప్రతినిధిగా, ఇటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలిగా జిల్లాలోని కార్యక్రమాలకు ఆమె మొక్కుబడిగా హాజరవుతారనే అపవాదు వస్తోంది. గత జూలైలో గోదావరికి వరదలు వచ్చినప్పుడు పినపాక నియోజకవర్గంలో బాధితులను పరామర్శించడం మినహా చెప్పుకోతగ్గ కార్యక్రమాల్లో ఆమె భాగం కాలేకపోయారు. ఐటీడీఏ భద్రాచలం సర్వసభ్య సమావేశం, డిసెంబరులో 'దిశ' మీటింగ్ వంటి కార్యక్రమాలకే హాజరయ్యారు. అక్కడ కూడా స్థానిక సమస్యలపై ఆకట్టుకునే ప్రసంగం, జిల్లాకు తెచ్చిన నిధులు తదితర అంశాలేమీ ఆమె ప్రస్తావించలేకపోయారు. ఆఖరికి ఆమె కొద్దోగొప్పో ఆసక్తి చూపించే ఇల్లెందు నియోజవర్గానికి సంబంధించి ఆర్టీసీ బస్‌డిపో శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కాకుండా కేవలం వీడియో సందేశంతో సరిపెట్టడం గమనార్హం. కరోనా తర్వాత పార్లమెంట్ సభ్యురాలిగా జిల్లాలో ప్రభావం చూపగలిగే ఏ ఒక్క కార్యక్రమంలోనూ ఆమె భాగం కాలేదంటూ ఆ పార్టీ వర్గాలే అంటున్నాయి.

పార్టీ కార్యక్రమాలకూ దూరంగానే..

అసెంబ్లీ, పార్లమెంట్ వంటి ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనే రాజకీయ నేతలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారు. వివిధ పండుగలు, జాతీయ దినోత్సవాలు, పార్టీ ఆవిర్భావ వేడుకలు, పార్టీ పిలుపు మేరకు చేపట్టే ఆందోళన కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటారు. కానీ తన పార్లమెంట్ నియోజవర్గం పరిధిలో ఉన్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ తరహా కార్యక్రమాలకు ఎంపీ కవిత దూరంగా ఉంటూ వస్తున్నారు. ఒక దశలో తమకు ఒక ఎంపీ ఉన్నారనే విషయాన్ని సైతం నియోజవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలు మరిచిపోయే స్థితి వచ్చిందంటూ గులాబీ పార్టీ శ్రేణులే వ్యాఖ్యానించే పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ కేంద్రమైన మహబూబాబాద్, పక్కన ఉన్న డోర్నకల్‌తో పాటు భద్రాద్రి జిల్లాపైనా ఎంపీ ఫోకస్ చేయడం మంచిదంటూ ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. లేదంటే రాబోయే ఎన్నికల్లో వ్యక్తిగతంగా కవిత కంటే పార్టీకి ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

విప్ రేగా క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ముంపు బాధితులు

మణుగూరు రూరల్ : గోదావరి వరద ముంపు వల్ల సర్వం కోల్పోయిన ఆదివాసీ, దళిత, ఇతర మహిళలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం, గోదావరి వరద బాధితుల నిరుపేద గృహకల్ప పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత అంబేద్కర్ సెంటర్ నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి నిర్మల, ఏఐటీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఊక్లా, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరరావు మాట్లాడారు. 2022 జూలైలో వచ్చిన గోదావరి వరద వల్ల ముంపునకు గురైన బాధితులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జెడ్పీటీసీపోశం నరసింహారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిడెం ప్రశాంత్, భూలక్ష్మి, ఆదిలక్ష్మి, గణేష్, ఎర్రన్న, పాపారావు, సుజాత, భద్రమ్మ, లక్ష్మి చందు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

18న బ్యాంక్ లోక్ అదాలత్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 18న జిల్లా కోర్టులో నిర్వహించే బ్యాంక్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్, ఇతర బ్యాంకులకు సంబంధించి వ్యక్తిగత, ఇతర అవసరాలకు తీసుకున్న రుణాల కేసులను వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండరెడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

అశ్వారావుపేటరూరల్: మారుమూల ప్రాంతాల్లో ఉన్న కొండరెడ్ల ఆవాసాల అభివృద్ధి, సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. మండలంలోని కొండరెడ్డి గ్రామాలైన రెడ్డిగూడెం, సుద్దగోతులగూడెం, గోగులపూడి, గుబ్బల మంగమ్మ ఆలయం ప్రాంతాల్లో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. రెడ్డిగూడెం గ్రామంలో కొండరెడ్ల చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులు, గర్భిణులతో మాట్లాడి పోషకాహారం అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఐటీడీఏ నిధులతో ప్రధాన రహదారి నుంచి సుద్దగోతులగూడెం గ్రామానికి నిర్మిస్తున్న బీటీ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. బీటీ రోడ్డును మరో 250 మీటర్ల పొడవు పెంచాలని గ్రామస్తులు కోరగా, రూ.20లక్షలు మంజూరు చేస్తానని చెప్పారు. అనంతరం గోగులపూడి గ్రామంలో రూ.16లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనం, రూ.15లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కొండరెడ్డి కళాకారుల హస్తకళ తయారీ కేంద్రం భవనాలను పరిశీలించారు. ఆ తర్వాత దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుడ్లగూబ టవర్‌ను పరిశీలించారు. రూ.11.20లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదులను పరిశీలించి, లబ్ధిదారులకు కేటాయించాలని అధికారులనుఆదేశించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో వెనుకబడిన కొండరెడ్లకు అండగా ఉంటామని అన్నారు. కాగా పీఓకు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి తదితరులు వివిధ సమస్యలపై వినతులు అందించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు యాట్ల మహేశ్వరరెడ్డి, కంగాల భూలక్ష్మి, గొంది లక్ష్మణ్‌రావు, కొండరెడ్ల ప్రత్యేకాధికారి సురేష్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, తహసీల్దార్ లూథరన్ విల్సన్, ఐటీడీఏ డీఈ రామిరెడ్డి, ఫారెస్ట్ రెంజర్ అబ్దుల్ రెహమాన్, ఎంపీడీఓ విద్యాధరరావు, సీడీపీఓ రోజా రాణి, ఐటీడీఏ ఏఈ ప్రసాద్, ఎంపీఓ సీతారామరాజు పాల్గొన్నారు.

నవమి ఏర్పాట్లపై 20న మంత్రి సమీక్ష

నేడు పరిశీలించనున్న కలెక్టర్ అనుదీప్



రామాలయ అధికారులకు సత్రం పత్రాలను అందజేస్తున్న టీటీడీ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక ప్రయుక్త ద్వాదశ కుండాత్మక చతుర్వేద సహిత శ్రీరామాయణ మహాక్రతువు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లపై ఈ నెల 20న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్ కుమార్ భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. కలెక్టర్ అనుదీప్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో సమీక్షించనున్నారు. కాగా రామాలయంలో నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన టి.అప్పారావు, కుమారి దంపతులు రూ. 50 వేలు విరాళం అందించారు.

టీటీడీ సత్రం ఆలయానికి అప్పగింత

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో భద్రాచలంలోని తానీషా కల్యాణ మండపం వెనుక రూ.4.75 కోట్లతో నిర్మించిన యాత్ర వసతి సదుపాయం(సత్రం)ను టీటీడీ అధికారులు గురువారం రామాలయానికి అప్పగించారు. ఈఈ రవీందర్, ఏఈఓ భవానీ రామకృష్ణకు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఏసీలు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యాలను సమకూర్చాల్సి ఉంది. అనంతరమే భక్తులకు ఈ వసతి గృహం అందుబాటులోకి రానుంది. ఈ శ్రీరామనవమికి గదులు అందుబాటులోకి వస్తాయని భావించిన భక్తులకు మళ్లీ నిరాశే ఎదురయింది.

రజకులకు రంధి లేకుండా..



దోబీఘాట్‌లో ఏర్పాటు చేయనున్న యంత్రాలు

- జిల్లాలో రూ.8 కోట్లతో నాలుగు దోబీఘాట్లు..
- నాలుగు మున్సిపాలిటీల్లో స్థలాల గుర్తింపు
- అధునాతన సౌకర్యాలతో నిర్మాణం..



సిద్దిపేటలో నిర్మించిన ఈ దోబీఘాట్ తరహాలోనే జిల్లాలో కూడా నిర్మించనున్నారు

ఇల్లెందు: చెరువులు, కుంటలు, వాగులు, వంకల వద్ద బట్టలు ఉతికేందుకు రజకులు పడుతున్న తిప్పలు ఇక తొలగిపోనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీలో రూ.2 కోట్లతో అధునాతన దోబీఘాట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో రూ.8 కోట్లతో నాలుగు దోబీఘాట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలు గుర్తించాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ డి.అనుదీప్ ఆదేశించారు. దీంతో వారు కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందులో స్థలాలు గుర్తించారు.

నేడో, రేపో టెండర్..

స్థలాలు గుర్తింపు పూర్తికావడంతో అధికారులు నేడో రేపో టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేయనున్నారు. దోబీఘాట్‌లో షెడ్డు, 30 కిలోల కెపాసిటీ కలిగిన మూడు వాషింగ్ మిషన్లు, మూడు స్పిన్నర్లు, ఒక స్టీమ్ బాయిలర్, క్యాలెండర్ మిషన్, రెండు డయ్యర్లు, ఇస్త్రీ చేసేందుకు మూడు ఐరన్ ఎలక్ట్రికల్ టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో దోబీఘాట్‌లో 8 గంటల్లో టన్నుల దుస్తులను ఉతుకొచ్చని, సుమారు 500 మంది రజక కుటుంబాలకు ఉపయోగం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మురికి, మైల బట్టలు ఉతికే క్రమంలో కొందరు రజకులు అనారోగ్యం పాలవుతున్నారు. దీంతో వృత్తిదారుల ఆరోగ్యం కాపాడేందుకు నూతన టెక్నాలజీ ఉపయోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

500 చదరపు గజాల స్థలంలో..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దోబీఘాట్‌లు ఒకే నమూనాలో ఇంజనీరింగ్ అధికారులు డిజైన్ చేశారు. 500 చదరపు గజాల స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసి అందులో పలు రకాలుగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ మిషనరీలను ఏర్పాటు చేయనున్నారు. గతంలో నిర్మించిన దోబీఘాట్‌లలో చేతులతో ఉతికేలా నీటి సదుపాయం కోసం ట్యాంకు, బోరు/బావి, వాగు, చెరువుకు మోటార్‌లు, పైపులైన్ ఏర్పాటు, విద్యుత్ సదుపాయం కల్పించే వారు. కానీ ప్రస్తుతం అధునాతన యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. మురికి బట్టలను యంత్రాలసాయంతో ఉతికి అందులోనే ఆరబెట్టే సదుపాయం ఉంటుంది. ఇక చీరెలు రోలింగ్ కోసం రోలింగ్ యంత్రాలు కూడా ఏర్పాటు చేస్తారు. డ్రైక్లీనింగ్ తరహాలో ఈ దోబీఘాట్‌లు పని చేయనున్నాయి.

అధునాతనంగా ఉండాలి



ఎన్నో ఏళ్ల క్రితం పట్టణంలో ఒకటి రెండుచోట్ల దోబీఘాట్లు ఏర్పాటు చేసినా అవి ప్రస్తుతం ఉపయోగంలో లేవు. దీనికి తోడు పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. మోడ్రన్ దోబీఘాట్లు ఏర్పాటు చేస్తే రజకుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. అధునాతన పోకడలను అందిపుచ్చుకోవాలి.

–సాతెల్ల గిరి, రజక సంఘం నేత, ఇల్లెందు

స్థలం సేకరించాం..



ఇల్లెందు మున్సిపాలిటీలో నిర్మించనున్న దోబీఘాట్ కోసం 18వ వార్డులో స్థలసేకరణ పూర్తి చేశాం. రజక వీధికి సమీపంలోని ఖాళీ స్థలం కేటాయించాం. టెండర్ పూర్తయితే పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. అధునాతన యంత్రాలు ఏర్పాటు చేయడంతోపాటు మరమ్మతులు చేపట్టేందుకు మెకానిక్‌లు, టెక్నీషియన్‌లు కూడా అందుబాటులో ఉంటారు.

–అంకుషావలి, ఇల్లెందు మున్సిపల్ కమిషనర్

సెకండియర్ పరీక్షలు షురూ..

- ప్రశాంతంగా ఇంటర్ రెండో సంవత్సరం ఎగ్జామ్స్ ప్రారంభం
- తొలిరోజు 554 మంది విద్యార్థులు గైర్హాజరు



కొత్తగూడెం అర్బన్: హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది




పాల్వంచ రూరల్: గురుకుల కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



జూలూరుపాడు: పరీక్షకు వచ్చిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిమిషం నిబంధన ఉండటంతో విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 144 సెక్షన్ అమలులో ఉండటంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర వ్యక్తులు గుంపులుగా ఉండకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 35 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్‌కు సంబంధించి 7,131 మందికి 6,716 మంది పరీక్షకు హాజరయ్యారు. 415 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,965 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1,826 మంది హాజరయ్యారు. 139 మంది హాజరుకాలేదు. మొత్తం 9,096 మందికి 8,542 మంది విద్యార్థులు హాజరు కాగా 554 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సులోచనారాణి తెలిపారు. ఆమె ఇల్లెందు సహా పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి, పరిశీలించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు.

రెండో విడతకు కసరత్తు



గొర్రెల పంపిణీకి పశుసంవర్ధకశాఖ కార్యాచరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి కసరత్తు ప్రారంభమైంది. రాష్ట్రస్థాయిలో పథకానికి నిధులు విడుదల కావడంతో జిల్లాలో పశుసంవర్ధకశాఖ అధికారులు ముందస్తుగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం మొదటి విడత గొర్రెల పంపిణీ చేపట్టి నాలుగున్నరేళ్లు గడుస్తోంది. అయినా రెండో విడత పంపిణీ చేపట్టకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. ఈ క్రమంలో త్వరలోనే రెండో విడత పంపిణీ చేస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంకేతాలు రావడంతో లబ్ధిదారుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. జిల్లాలో 136 గొర్రెల, మేకల పెంపకందారుల సొసైటీలు ఉండగా, వీటి పరిధిలో 11,060 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో మొదటి విడతలో 7,511 మందికి జీవాలను పంపిణీ చేశారు. రెండో విడతలో 3,549 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటికే 1,411 మంది తమ వాటాగా డీడీ తీశారు. 20 గొర్రెలు, ఒక గొర్రెపోతు యూనిట్‌గా ఉండగా, విలువ గతంలో రూ.1.25 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.1.75 లక్షలకు చేరింది. ఇందులో లబ్ధిదారుల వాటా 25 శాతం కాగా, 75 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనుంది.

నిధులు విడుదలైతే ఏప్రిల్ నుంచి..



రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రస్థాయిలో నిధులు విడుదలైనా ఇంకా జిల్లాకు నిధులు చేరలేదు. నిధులు విడుదలైతే ఏప్రిల్ మాసంలో గొర్రెలు పంపిణీ చేస్తాం. ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. –బి.పురంధర్, జిల్లా పశుసంవర్ధక అధికారి

నగదు జమ చేయాలి



గొర్రెల పంపిణీ పథకంలో దళితబంధు మాదిరిగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలి. సుదూర ప్రాంతాల నుంచి తీసుకురావడం వల్ల జీవాలు అనారోగ్యం పాలవుతున్నాయి. దీంతో నష్టం జరుగుతోంది. –కాసాని ఐలయ్య, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

సింగరేణి కళాశాలలో నేడు, రేపు 'మిస్ట్' వర్క్‌షాప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యాన శుక్ర, శనివారాల్లో మోటివేషన్ ఇన్నోవేషన్ సపోర్ట్ ట్రెనింగ్ ఫర్ యంగ్ ఉమెన్ ట్రేనర్స్ (ఎంఐఎస్‌టీ(మిస్ట్))అనే అంశంపై రాష్ట్రస్థాయిలో రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారద గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా, కేఎల్, కాకతీయ విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లు హాజరవుతారని పేర్కొన్నారు. తొలిరోజు వ్యాపార రంగంలో నూతన ఆవిష్కరణలతో పాటు మెరుగైన నైపుణ్యాలపై మెళకువలు, రెండో రోజు విద్యార్థినుల సృజనాత్మకత ఆధారంగా తయారు చేయబడిన క్రాఫ్ట్స్, ఫుడ్ స్టాల్స్ ప్రదర్శించబడతాయని చెప్పారు. వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కోరారు.

బంక్‌లో డిజిటల్ సేవలు కరువాయె..



ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బంక్

చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణంలో ఇటీవల ఆర్టీసీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో డిజిటల్ నగదు చెల్లింపు సేవలు అందుబాటులో లేకపోవడంతో కస్టమర్లు ఇబ్బంది పడుతున్నారు. బంక్ యజమానులు స్వైపింగ్ మిషన్, గూగుల్–పే, ఫోన్–పే వంటి సేవలను అందుబాటులో లేకపోవడంతో రోజూ పెట్రోల్, డీజిల్ కోసం వచ్చి పోయే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఇక్కడ కేవలం నగదు చెల్లింపులకే ప్రాధాన్యత ఇవ్వడంతో కస్టమర్లు అటువైపుగా వెళ్లాలంటే సాహసించడం లేదు. ఆర్టీసీ అధికారులు, నిర్వాహకులు స్పందించి తక్షణమే డిజిటల్ చెల్లింపు సేవలను అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఆరుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

అన్నపురెడ్డిపల్లి: ఆరుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రానికి చెందిన పంది కేశవరావు అదే గ్రామానికి చెందిన రావులపల్లి భారతి(ఎస్సీ)తో కుటుంబ సభ్యులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నాడు. పెళ్లయిన తర్వాత అశ్వారావుపేటలో ఇల్లు అద్దెకు తీసుకొని కొంతకాలం జీవించగా.. ఇటీవల కేశవరావు వేరే మహిళలతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలిసిన భార్య కేశవరావును ప్రశ్నించగా.. మానసికంగా వేధించి, కులం పేరుతో దూషించాడు. విషయాన్ని భర్త కుటుంబ సభ్యులకు తెలియజేసినా పట్టించుకోకపోగా, వారు కూడా తనను కులం పేరుతో తిట్టారని బాధిత మహిళ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో భర్త కేశవరావుతో పాటు అతని కుటుంబ సభ్యులు యాలాద్రి, మహేశ్వరి, మోరంపూడి నాగేశ్వరరావు, పద్మ, వెంకటలక్ష్మిలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై షాహిన తెలిపారు.

చందా ఇవ్వాలని బెదిరించిన ఇద్దరిపై..

పాల్వంచ: ఓ జాతీయ నాయకుడి విగ్రహాన్ని నెలకొల్పేందుకు చందా ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను బెదిరించిన వ్యక్తులపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గట్టాయిగూడెంకు చెందిన బొమ్మిశెట్టి పూర్ణచందర్‌రావు కోడిగుడ్లు, చికెన్ సరఫరా చేసే కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 14వ తేదీన పూర్ణచందర్‌రావుకు కేటీపీఎస్ ఉద్యోగి దండోర శ్రీను, కత్తి శ్రీను అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేసి బస్టాండ్‌సెంటర్‌లో ఓ జాతీయ నాయకుడి కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని, చందా ఇవ్వాలని బెదిరించారు. అందరు కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తున్నామని, నువ్వు కూడా ఇవ్వాలని బెదిరింపులకు దిగారు. కాల్ రికార్డ్ చేసిన పూర్ణచందర్‌రావు వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్సై ప్రవీణ్‌కుమార్ వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాల సామగ్రి ధ్వంసం

ఇల్లెందురూరల్: మండలంలోని సంజయనగర్ ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు–మన బడి పథకంలో భాగంగా చేపట్టిన నూతన నిర్మాణాలను గురువారం ఆకతాయిలు ధ్వంసం చేశారు. పాఠశాల ఆవరణలోని మూత్రశాల, మరుగుదొడ్డి, తాగునీటి పంపులను పూర్తిగా ధ్వంసం చేశారు. ఇదే విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు శ్రీకృష్ణప్రసాద్ పశువుల సంత వేలం

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం కొమ్మినేపల్లిలోని పండితాపురం శ్రీ కృష్ణప్రసాద్ పశువుల సంత నిర్వహణకు శుక్రవారం వేలం నిర్వహిస్తునట్లు సర్పంచ్ మూడ్ దుర్గాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ తెలిపారు. పీసా చట్టం ప్రకారం గ్రామపంచాయతీ పరిధిలోని షెడ్యూల్ తెగకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వేలం మొదలవుతుందని, అత్యధిక ధర కోట్ చేసిన వారు సాయంత్రం 4 గంటల్లోగా సొమ్ములో 1/3 శాతం నగదు చెల్లించకపోతే రెండో పాటదారుడికి సంత కొలు అప్పగిస్తామని తెలిపారు. కాగా, వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోతే రద్దు చేస్తామని వెల్లడించారు.

అకాల వర్షంతో ఆగమాగం..

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

- ఈదురు గాలులతో నేలవాలిన పంటలు
- కల్లాల్లోని పంటలను కాపాడుకునేందుకు రైతుల పరుగులు
- ఆందోళన చెందుతున్న రైనం

వాతావరణంలోని మార్పుల కారణంగా మండలాల్లో గురువారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. గత వారం రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్నప్పటికీ రైతులు అంతగా పట్టించుకోలేదు. ఈక్రమంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో అంతర్గత రోడ్లన్నీ జలమయమయం కాగా రైతులు కల్లాల్లో ఆరబోసిన పంటలను కాపాడుకునేందుకు పరుగులు తీశారు. చేతికొచ్చిన మొక్కజొన్న, మిర్చి, పొద్దు తిరుగుడు వంటి తోటలు నెలవాలాయి. మామిడి కాయలు సైతం నేలరాలాయి. అకాల వర్షానికి నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్





గుండాల: రోళ్లగడ్డ తండాలో నేలరాలిన మొక్కజొన్న చేను, (ఇన్‌సెట్) చంద్రుగొండ : వర్షం వస్తుండటంతో కల్లంలోని మిర్చిని రాశిగా పోస్తున్న రైతులు



భద్రాచలంటౌన్: కూనవరం రోడ్డులో కురుస్తున్న వర్షం



చర్ల: తేగడలో మిర్చి కాయలపై పరదాలు కప్పుతున్న రైతులు, కూలీలు



బూర్గంపాడు: వర్షానికి తడుస్తున్న మిర్చిని కుప్పలు చేస్తున్న రైతులు



దుమ్ముగూడెం: ఆంధ్రకేసరినగర్ కాలనీలో ఓ రైతు మిర్చిపంటపై కప్పిన పట్టా



పాల్వంచరూరల్: ఉల్వనూరు వీధుల్లో ప్రవహిస్తున్న వర్షం నీరు

దొంగనోట్ల ముఠా అరెస్ట్

- ఏపీలో పట్టుబడిన ఉమ్మడి జిల్లా వాసులు
- రూ.45లక్షల నకిలీ నోట్లు, ప్రింటర్లు స్వాధీనం

పాల్వంచ: ఏజెన్సీ ఏరియాలోని అమాయకులే లక్ష్యంగా నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ముఠాను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాలో కీలక సూత్రధారులు పాల్వంచకు చెందిన వ్యక్తులు ఉండడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో నకిలీ కరెన్సీ నోట్లను చెలామణి చేస్తున్నట్లు పోలీసులకు గుర్తించారు. ఈమేరకు ఏకకాలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, భద్రాచలం, ఏపీలోని వీ.ఆర్.పురం మండలం రేఖపల్లిలో తనిఖీలు చేపట్టి ఒక మహిళ సహా తొమ్మిది మందిని అరెస్టు చేయగా వివరాలను గురువారం చింతూరులో ఎస్పీ సతీశ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. పాల్వంచకు చెందిన పాదిలి మురళి, జంగం శ్రీనివాస్, కటారి సామ్రాజ్యం, భద్రాచలానికి చెందిన గొడుగొల్ల కిరణ్‌కుమార్, సత్తుపల్లికి చెందిన కొనకాళ్ల చిట్టిబాబు, అశ్వారావుపేట అచ్యుతాపురానికి చెందిన పాకనాటి నాగేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా ఉప్పల్‌కు చెందిన పసుపులేటి ఉమేశ్‌చంద్రతో పాటు ఏపీలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేముల పుల్లారావు, పాదిలి శ్రీనివాస్ ముఠాగా ఏర్పడి నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించి చెలామణి చేస్తున్నారు. వీరంతా పాల్వంచలోని పాదిలి మురళి ఇంట్లోనే నకిలీ నోట్లను ముద్రించినట్లు గుర్తించగా.. రూ.45లక్షల విలువైన నకిలీ నోట్లు, మూడు ప్రింటర్లు,ఒక కంప్యూటర్‌తో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కాగా, దొంగ నోట్ల ముద్రణకు కావాల్సిన పెట్టుబడి గొడమల్ల కిరణ్‌కుమార్ సమకూర్చడంతో పాటు భద్రాచలం, ఏటపాక, చింతూరు, వీఆర్‌పురం, కుంట, నెల్లిపాక, రేఖపల్లి, కూనవరం, పాల్వంచ తదితర ప్రాంతాల్లో రూ.లక్ష నకిలీ కరెన్సీని చెలామణి చేసినందుకు రూ.10వేల నగదు కిరణ్‌కుమార్ చెల్లించినట్లు సమాచారం.

21.5 కేజీల గంజాయి స్వాధీనం

లోతువాగు వద్ద 11.5 కేజీల స్వాధీనం

కొత్తగూడెంరూరల్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు వద్ద గురువారం ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి 11.5 కిలోల గంజాయిని రూ.50 వేలకు కొనుగోలు చేసి బైక్‌పై హైదరాబాద్ తరలిస్తున్న జనగామకు చెందిన శశాంక్, ఖమ్మంకు చెందిన సాకేత్‌లను ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద రూ.2.50 లక్షలు విలువ చేసే గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి కొత్తగూడెం ఎక్సైజ్ పోలీసుల స్టేషన్‌కు తరలించినట్లు సీఐ శామ్యూల్ తెలిపారు. వాహనాల తనిఖీలో ఎస్సై ముబషీర్ అహ్మద్, హెడ్ కానిస్టేబుల్ కరీం, బాలు, కానిస్టేబుల్ సుధీర్, వెంకటేష్, హనుమంతరావు, విజయ్‌లు పాల్గొన్నారు.

జూలూరుపాడులో.. 10 కేజీలు స్వాధీనం

జూలూరుపాడు: ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం జూలూరుపాడులోని ఒంటిగుడిసె క్రాస్ రోడ్డు సమీపంలో ఎస్సై పోటు గణేష్ తన పోలీస్ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులు వాహనాల తనిఖీ విషయాన్ని గమనించి బైక్‌ను వెనక్కి తిప్పుకొని పారిపోతుండగా.. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 10 కేజీల నిషేధిత గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో మహారాష్ట్రలోని అమరావతికి చెందిన ఎస్‌కె. సల్మాన్, హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌కు చెందిన ఎస్‌కె. యూనిస్ ఉన్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ చెప్పారు.



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

యువతిని మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష

అశ్వారావుపేటరూరల్: ఓ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధించారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన మొడియం శ్రీనివాసరావు ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో శారీరకంగా వాడుకుని పెళ్లికి నిరాకరించాడు. కాగా, ఆమె 2016 జూన్ 26వ తేదీ రాత్రి శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పెళ్లి చేసుకోమని అడుగగా.. అతడు నిరాకరించడంతో అక్కడే ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో స్థానికులు యువతిని ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. దీనిపై బాధితురాలు చేసిన ఫిర్యాదుపై నాటి ఏఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేయగా, అప్పటి ఎస్సై పి.వెంకన్న, సత్తుపల్లి ఇన్‌చార్జ్ సీఐ కె.రాజేంద్రప్రసాద్ దర్యాప్తు చేసి నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులు పూసప్ప, రాములమ్మపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం ఆయన తల్లిదండ్రులపై కేసు కొట్టేసి శ్రీనివాసరావుకు సెక్షన్ 376 ప్రకారం పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా, సెక్షన్ 417 ప్రకారం ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి వాదించారు.

వ్యక్తికి ఏడాది జైలు..

- రూ.2 వేలు జరిమానా

టేకులపల్లి: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఒకరి మృతికి కారణమైన ఓ వ్యక్తికి జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించారు. పోలీసులు కథనం ప్రకారం.. 2017లో టేకులపల్లికి చెందిన చిర్రా సతీష్ అతి వేగంగా వాహనాన్ని నడుపుతూ ఒకరి మృతికి కారణమయ్యాడు. దీంతో ఈ కేసుపై గురువారం ఇల్లెందు కోర్టులో వాదోపవాదాలు జరిగిన అనంతరం సతీష్‌కు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ముకేష్ ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే మరో రెండు నెలలు శిక్ష ఖరారు చేశారు. ప్రాసిక్యూషన్‌కు ఏపీపీ వి.రచిత, హోంగార్డు రమేష్, ఐఓ టి.సురేష్, సీడీఓ బి.నరేష్, బి.శ్రీనివాస్‌లు సహకరించారు.

మూడు ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్న ఓ జేసీబీ, మూడు ట్రాక్టర్లను గురువారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ప్రకారం.. మండల కేంద్రంలోని వీకేడీవీ రాజు ప్రైవేట్ కాలేజీ వెనుక వైపు అనుమతి లేకుండా ఎర్ర మట్టిని జేసీబీతో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి జేసీబీతో పాటు మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు ఆపై స్థానిక తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుతో 20 మేకలు మృతి

చర్ల: మండలంలోని మామిడిగూడెంలో గురువారం సాయంత్రం పిడుగుపడి 20 మేకలు మృతి చెందాయి. బాధిత రైతులు, మేకల కాపరి తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిగూడెంకు చెందిన నలుగురు గిరిజన రైతులు కారం లక్ష్మయ్యకు చెందిన 6 మేకలు, కొంద్రు నాగయ్య 2, శ్యామల లక్ష్మి 1, కారం శంకర్‌రావుకు చెందిన 2 మొత్తం 11 మేకలతో పాటు అదే గ్రామానికి చెందిన కారం వీరాస్వామికి చెందిన 9 మేకలను మేపేందుకు వీరాస్వామి సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు వీస్తూ వర్షం కురుస్తుండడంతో మేకలన్నీ గ్రామ శివారులో ఉన్న చింతచెట్టు కింద ఆగాయి. ఈ నేపథ్యంలో చింతచెట్టుపై పిడుగుపడి 20 మేకలు మృతి చెందాయి. ఈ ఘటనలో వీరాస్వామి దూరంగా ఉండడంతో అతనికి ఏమీ కాలేదు. సుమారు రూ. 2.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. తహసీల్దార్ బి.భరణిబాబు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వరలక్ష్మి సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. బాధిత రైతులను స్థానిక సర్పంచ్ కారం సమ్మయ్య పరామర్శించి పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మృతి చెందిన మేకలు

శిలాఫలకం ఏర్పాటు చేశారు!

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని ఆర్టీఏ సబ్‌యూనిట్ ఆఫీసు వద్ద గురువారం శిలా ఫలకాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. పాత ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఈనెల 14న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆర్టీఏ సబ్ యూనిట్ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం మంత్రి ప్రారంభించిన శిలాఫలకం తొలగించారు. ఇదే విషయంపై గురువారం 'సాక్షి' దినపత్రికలో 'మంత్రి ప్రారంభించగానే..శిలాఫలకం తొలగించారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్టీఏ అధికారులు తిరిగి శిలాఫలకం ఏర్పాటు చేశారు.



ఆర్టీఏ సబ్ యూనిట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

మొసలికి పంచనామా..

బూర్గంపాడు: బూర్గంపాడు సమీపంలోని గొమ్మూరు వద్ద గోదావరి ఒడ్డున మృతి చెందిన మొసలికి అటవీశాఖ అధికారుల ఆధ్వర్యాన పశు సంవర్ధకశాఖ అధికారులు గురువారం శవ పంచనామా నిర్వహించారు. మొసలి మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు శవ పంచనామా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్..

బూర్గంపాడు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బూర్గంపాడుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బుయ్యన మహేష్(33) బుధవారం నాగినేనిప్రోలు గ్రామ సమీపంలో మట్టి తొలకానికి వెళ్లాడు. గ్రావెల్ తోలుతుండగా.. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి ట్రాక్టర్ కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు భద్రాచలం ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తుండగా.. గురువారం మృతి చెందాడు. మృతుడుకి భార్య సంధ్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న మహిళ..

టేకులపల్లి: అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతున్న గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండల కేంద్రంలోని ఏ కాలనీతండాకు చెందిన అంగోతు బద్రి(55) తన ముగ్గురు కుమార్తెలకు వివాహం చేసింది. కాలక్రమేణా అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరివేసుకుని వ్యక్తి..

బూర్గంపాడు: కుటుంబకలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన సారపాకలోని రిక్షాకాలనీలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రిక్షా కాలనీకి చెందిన చెలికాని ఏడుకొండలు(30) కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించే సరికే అతడు మృతిచెందాడు. మృతుడు సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు ఎస్సై సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులు తాళలేక మహిళ..

మణుగూరుటౌన్: వరకట్న వేధింపులతో ఓ మహిళ ఎలుకల మందు తాగి మృతి చెందింది. పోలీసులు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మణుగూరు మండలం సమితిసింగారం పంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన కొన తనూజ(23)కు 2019లో వివాహమైంది. వరకట్నం కోసం ఆమె భర్త, అత్త తరచూ వేదించడంతో మనస్తాపం చెంది బుధవారం సాయంత్రం ఎలుకల మందు తాగగా.. పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలికి ఓ కొడుకు. కాగా, ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మణుగూరు సీఐ ముత్యం రమేష్ తెలిపారు.

హరిభూషణ్ పేరుతో నగదు వసూళ్లు

బయ్యారం: మావోయిస్ట్ రాష్ట్ర మాజీ కార్యదర్శి హరిభూషణ్ పేరుతో వసూళ్లు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలను ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సీతారాంపురానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన దళ కమాండర్ ముత్తయ్య అలియాస్ ఆజాద్, బయ్యారానికి చెందిన మాజీ నక్సలైట్ పసుల లింగయ్య అలియాస్ లింగన్న, ఖమ్మం బల్లేపల్లికి చెందిన బత్తుల రామకృష్ణ, బయ్యారానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన ఆర్గనైజర్ నిమ్మల లింగయ్య ముఠాగా ఏర్పడ్డారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇల్లెందు నుంచి కొత్తపేటలోని తన వ్యవసాయ భూమి వద్దకు వచ్చిన వ్యాపారి యాదగిరిరెడ్డిని ఎయిర్‌గన్‌తో బెదిరించి హరిభూషణ్ పేరిట రూ.20 లక్షలు డిమాండ్ చేయగా డబ్బు ఇవ్వకపోవటంతో కిడ్నాప్ చేశారు. ఆతర్వాత రూ.1.20 లక్షలు తీసుకుని విడుదల చేశారు. బయ్యారంలో సీసీఎస్, స్థానిక పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా వసూళ్ల వ్యవహారం బయటపడింది. దీంతో నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ రమణబాబు తెలిపారు. నిందితుల అరెస్టులో కీలకంగా వ్యవహరించిన సీఐలు మోహన్, బాలాజీ, ఎస్‌ఐలు రామారావు, రమాదేవి, సిబ్బంది పాపయ్య, రాజశేఖర్, విజయ్, బాలు, సుమన్, మధుసూదన్‌రెడ్డికు రివార్డులు అందజేశారు.

● సంక్షేమంతో కూడిన అభివృద్ధే లక్ష్యం

ఐదవసారీ అదే దారి

రూ.2,79,279.27 కోట్లతో 2023-24 ఏపీ వార్షిక బడ్జెట్

- అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయం
- వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం రూ.21,434 కోట్లు
- వచ్చే ఏడాది జనవరిలో పెన్షన్ రూ.3 వేలకు పెంపు
- మహిళలు, పిల్లల పథకాలకు ప్రత్యేక కేటాయింపులు
- మహిళల పథకాలకు రూ.77,914.43 కోట్లు
- పిల్లల పథకాలకు రూ.20,593.38 కోట్లు
- సంక్షేమం, వ్యవసాయం, విద్య, వైద్యం, సాగు నీరు, మౌలిక రంగాలకు పెద్ద పీట



మరోసారి సంక్షేమ-అభివృద్ధి బడ్జెట్

మంచి చదువు, మంచి వైద్యం, మంచి ఆరోగ్యం, రైతుల్లో సంతోషం, నా అక్క చెల్లెమ్మల్లో సాధికారత, జోరైన పారిశ్రామికాభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా మరోసారి సంక్షేమ-అభివృద్ధి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. అసమానతలు తగ్గించి, పేదరికాన్ని నిర్మూలించే దిశగా ఈ బడ్జెట్ ద్వారా మరో అడుగు ముందుకేశాం.

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బడ్జెట్ స్వరూపం	
రెవెన్యూ రాబడి	రూ.2,06,224.01 కోట్లు
ప్రజా రుణం	రూ.72,022.09 కోట్లు
రుణాల రికవరీ	రూ.56.32 కోట్లు
పబ్లిక్ అకౌంట్స్	రూ.976.85 కోట్లు
మొత్తం రాబడి	రూ.2,79,279.27
రెవెన్యూ వ్యయం	రూ.2,28,540.71 కోట్లు
మూల ధన వ్యయం	రూ.31,061.04 కోట్లు
రుణ చెల్లింపులు	రూ.18,411.42 కోట్లు
రుణాలు & అడ్వాన్స్	రూ.1,266.10 కోట్లు
మొత్తం వ్యయం	రూ.2,79,279.27 కోట్లు

రెవెన్యూ వ్యయం	మూలధన వ్యయం	మొత్తం ఆదాయం
రూ.2,28,540.71 కోట్లు	రూ.31,061.04 కోట్లు	రూ.2,79,279.27 కోట్లు

కేంద్ర పన్నుల వాటా రూపంలో రూ.41,338.02 కోట్లు

కేంద్ర గ్రాంట్లు	రెవెన్యూ లోటు	ద్రవ్య లోటు
రూ.46,834.64 కోట్లు	రూ.22,316.70 కోట్లు	రూ.54,587.52 కోట్లు

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడమే లక్ష్యంగా అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా నిలిచే అభివృద్ధి, సంక్షేమ సమతుల్యతతో కూడిన బడ్జెట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీకి సమర్పించింది. జెండర్ బేస్డ్ బడ్జెట్ ద్వారా సమాజంలో సగం ఉన్న మహిళలకు ప్రత్యేక కేటాయింపులు చేశారు. పిల్లలకు కూడా ప్రత్యేక కేటాయింపులు చేయడం విశేషం. అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనగా వరుసగా ఐదోసారి రూ.2,79,279.27 కోట్లతో 2023-24 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఉదయం 10 గంటలకు అసెంబ్లీకి సమర్పించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,28,540.71 కోట్లుగా, మూల ధన వ్యయం రూ.31,061 కోట్లుగా ఉంటుందని అంచనా వేసినట్లు బుగ్గన పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.23,316.70 కోట్లు రెవెన్యూలోటు, రూ.54,587.52 కోట్లు ద్రవ్యలోటు ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూ లోటు 3.77 శాతం, ద్రవ్యలోటు 1.54 శాతం ఉంటుందని, రెవెన్యూ ఆదాయం 2,06,224.01 కోట్లుగా అంచనా వేశామన్నారు. ఇందులో కేంద్ర పన్నుల వాటా నుంచి రూ.41,338.02 కోట్లు వస్తాయని, కేంద్రం నుంచి గ్రాంట్లరూపంలో రూ.46,834.64 కోట్లు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. రెవెన్యూ లోటుతో పాటు ద్రవ్య లోటును అదుపులో పెట్టే చర్యలు తీసుకున్నట్లు బడ్జెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతకు ముందు ఉదయం 8 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశమై 2023-24 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.

నవరత్నాలకు పెద్దపీట

ఎప్పటిలాగే మేనిఫెస్టోలోని నవరత్నాల పథకాల కొనసాగింపునకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలతో పాటు మైనారిటీ యాక్షన్ ప్రణాళిక పేరుతో భారీ ఎత్తున నిధులు కేటాయించారు. మొత్తం మీద రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజానీకాన్ని సంతృప్తి పరిచే స్థాయిలో బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు. మరో పక్క వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సాగునీటి రంగాల్లో మౌలిక రంగాలకు పెద్ద పీట వేశారు. బడ్జెట్‌లో ఎక్కడా దాపరికాలు లేకుండా పూర్తి పారదర్శకత ప్రదర్శించారు. ఏయే రంగాల్లో ఏయే పథకాలకు ఎన్ని నిధులు కేటాయించింది స్పష్టంగా వివరించారు. అవ్వా తాతల సామాజిక పెన్షన్లను వచ్చే ఏడాది జనవరిలో నెలకు 3 వేల రూపాయలు చేస్తామని ప్రకటించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్సార్ పెన్షన్ కానుకకు ఏకంగా రూ.21,434 కోట్లు కేటాయించారు. నవరత్న పథకాల్లోని అన్ని వర్గాలకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మైనారిటీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అందజేసే అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంక్షేమ పథకాలన్నింటినీ ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తామని స్పష్టం చేసింది.

సచివాలయాలకు కేటాయింపులు: చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, మత్స్యకారులు, దర్జీలు, చేనేత కార్మికులు, కాపులు, లాయర్లకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు.. గ్రామ, పట్టణ సచివాలయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నేరుగా నగదు బదిలీచేసే 22 నవరత్నాల పథకాలకు బడ్జెట్‌లో రూ.54,228 కోట్లు కేటాయించారు. మహిళల పథకాలకు ప్రత్యేకంగా రూ.77,914.43 కోట్లు, పిల్లల పథకాలకు ప్రత్యేకంగా రూ.20,593.38 కోట్లు కేటాయించారు. బీసీ ఉప ప్రణాళికకు రూ.38,605 కోట్లు, ఎస్సీ ఉప ప్రణాళికకు రూ.20,005 కోట్లు, ఎస్టీ ఉప ప్రణాళికకు రూ.6,929 కోట్లు, మైనారిటీ కాంపొనెంట్‌కు రూ.4,203 కోట్లు కేటాయించారు. సంక్షేమానికి రూ.51,345 కోట్లు, సాధారణ విద్యా రంగానికి రూ.32,198 కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.15,882 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.14,043 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.17,531 కోట్లు కేటాయించారు.

రైతుల సంక్షేమంపై శ్రద్ధ

రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపుతూ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రైతులకు సంబంధించిన అన్ని పథకాలకు కేటాయింపులు కొనసాగించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా జలవనరుల శాఖకు రూ.11,908 కోట్లు కేటాయించారు. మన బడి నాడు-నేడు కార్యక్రమానికి రూ.3500 కోట్లు.. వైద్య ఆరోగ్య రంగంలో నాడు-నేడు కార్యక్రమానికి రూ.2214.21 కోట్లు కేటాయించారు. పేదల గృహ నిర్మాణాలకు రూ.6291.70 కోట్లు, కాపుల సంక్షేమానికి రూ.4,887 కోట్లు, వైఎస్సార్ ఈబీసీ నేస్తంకు రూ.610 కోట్లు కేటాయించారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రూ.6,546 కోట్లు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి రూ.2,400 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వానికి రూ.532 కోట్లు కేటాయించారు.

2022-23 సవరించిన అంచనాలు

2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం మొత్తం బడ్జెట్ వ్యయం రూ.2,40,509.34 కోట్లుగా ఉంటుందని ఆర్థిక మంత్రి బుగ్గన తెలిపారు. రెవెన్యూ వ్యయం రూ.2,05,555.95 కోట్లు కాగా, మూల ధన వ్యయం రూ.16,846.69 కోట్లు అని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు దాదాపు రూ.29,107 కోట్లు కాగా, ఇదే కాలానికి ద్రవ్యలోటు రూ.47,716 కోట్లు అని చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూలోటు 2.21% కాగా, ద్రవ్యలోటు 3.62 శాతంగా ఉందని పేర్కొన్నారు.

సొంత సంస్థల్లోకి మళ్లిస్తున్నారు

- మార్గదర్శి.. మరో అగ్రిగోల్డ్, సహారా కాకముందే చర్యలు చేపట్టాం
- విచారణ 'పరిధి' అంశం పెండింగ్‌లో ఉండగా క్వాష్ పిటిషనా?
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- మార్గదర్శి పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ తన ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును సొంత సంస్థల్లోకి మళ్లిస్తోందని, అవి నష్టాల్లోకి వెళ్తే వేలాది కుటుంబాలు వీధిన పడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి మరో అగ్రిగోల్డ్, సహారా మాదిరిగా కాకముందే జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపింది. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు ఉన్నందున పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది. ప్రభుత్వానికి ఏ సంస్థ అయినా ఒకటేనని, అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడబోమని తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో తమ సంస్థకు చెందిన పలు బ్రాంచ్‌లపై నమోదైన కేసులను కొట్టివేయాలని / దర్యాప్తుపై స్టే ఇవ్వాలని అభ్యర్థిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. విచారణను ఏపీలో కాకుండా మరో రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని, అప్పటివరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. దీన్ని గురువారం విచారణకు చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ రెగ్యులర్ కేసులకు ఇబ్బంది లేకుండా సాయంత్రం 4.30 గంటల తర్వాత వాదనలు విన్నారు. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రా, ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. విచారణ 'పరిధి', కేసు మెరిట్ అంశాలపై వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

పునర్విభజన చట్టానికి విరుద్ధం

'మార్గదర్శి అక్రమాలపై 409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ పదేళ్లకు పైగా శిక్ష పడే కేసులే. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ రిలీఫ్ కోరలేరు. ఒకట్రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. కేసులు నమోదైన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు ఇక్కడ అరెస్టులు చేయవద్దని కోరడం చట్ట విరుద్ధం. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు కూడా పలు తీర్పులను ఇచ్చింది' అని ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి నివేదించారు. 'పరిధి' అంశం తేలకుండానే మళ్లీ క్వాష్ పిటిషన్ దాఖలు చేయడం దర్యాప్తును అడ్డుకోవడమే అవుతుందన్నారు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారని చెప్పారు. చిట్స్ పేర డబ్బులు సేకరించి ఉషాకిరణ్ లాంటి సంస్థల్లోకి మళ్లిస్తున్నారని తెలిపారు.

మరో రాష్ట్రానికి మార్చండి..

'మార్గదర్శి కేంద్ర కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఇక్కడి నుంచే బ్రాంచ్‌ల పర్యవేక్షణ జరుగుతుంది. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇక్కడే ఉంటారు. అందుకే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాం. దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలి. ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా తనిఖీలు చేస్తున్నారు' అని సిద్దార్థ లూత్రా పేర్కొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్

- మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ
- 5 స్థానాల్లో ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగిన 4 స్థానాల్లోనూ జయకేతనం
- కొనసాగుతున్న పట్టభద్రులు, టీచర్ల ఓట్ల లెక్కింపు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకుంది. వీటిలో 5 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన మిగతా 4 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ నాలుగు స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరిగింది. గురువారం ఓట్లు లెక్కించారు. శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి నర్తు రామారావు, కర్నూలు జిల్లా నుంచి మధుసూదన్, పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ ఘనవిజయం సాధించారు. ఈ నాలుగు స్థానాల్లోనూ సంఖ్యా బలం లేకపోయినా స్వతంత్రుల ముసుగులో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థులు ఘోర పరాజయం పాలయ్యారు. కాగా, 3 పట్టభద్రుల నియోజకవర్గాలు, 2 ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. స్థానిక సంస్థల కోటాలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కొక్కటి, పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు స్థానాలు మొత్తం 9 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎస్.మంగమ్మ, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, మేరుగ మురళీధర్, కుడిపూడి సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జిల్లా వార్తలు

పెసరలో పల్లాకు తెగులు ఉధృతి



కొణిజర్లలో పెసర పంటను పరిశీలిస్తున్న ఏఓ

కొణిజర్ల: యాసంగిలో సాగు చేసిన పెసర పంటకు పల్లాకు తెగులు సోకుతోంది. ఈమేరకు కొణిజర్ల మండల కేంద్రంలోని పలువురు రైతులు సాగు చేసిన పెసర పంటను ఏఓ డి.బాలాజీ పరిశీలించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రసం పీల్చే పురుగు వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుండగా, పూత రాకుండా దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ఈమేరకు పల్లాకు తెగులు కనిపించిన మొక్కలను తొలగించి చేనుకు దూరంగా పడవేయాలన్నారు. వేప నూనె 5 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని, తెగులు ఉధృతి ఆధారంగా ఎసిఫేట్ ఒక గ్రామును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎం.డీ.ఆఫ్రిన్, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై మినుముల విత్తనాలు

రఘునాథపాలెం: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ఎండాకాలంలో అపరాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'మినీ కిట్స్-సమ్మర్ పల్సస్ 2023' కార్యక్రమం ద్వారా రాయితీపై మినుముల విత్తనాలు అందిస్తోంది. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని రఘునాథపాలెం ఏఓ ఇంటూరి భాస్కరరావు సూచించారు. రైతులు ఏఈఓకు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ ఇచ్చి నాలుగు కేజీల బరువైన విత్తనాల సంచి తీసుకోవచ్చని తెలిపారు. కాగా, పంటకాలం 65 నుంచి 75 రోజులు ఉంటుందని, నీటి వసతి ఉన్న వారే సాగు చేసుకోవాలని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 19 మంది ఎంపిక



నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 19మంది ఉద్యోగాలు సాధించారు. ప్రైవేట్ సంస్థల్లో నలభై పోస్టులకు గాను పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరు కాగా 19 మందిని ఎంపిక చేశారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

జీసీసీలో గోల్‌మాల్

- అకౌంటెంట్‌పై సస్పెన్షన్ వేటు
- గతంలోనూ నలుగురు సస్పెండ్



పాల్వంచలోని జీసీసీ కార్యాలయం



గోదాంలోని సరుకులు

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ)పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో అవినీతి, అక్రమాలు సర్వసాధారణమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలోని పాల్వంచ బ్రాంచ్ జీసీసీలో అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వి.సంజీవరావు హాస్టళ్లకు నిత్యావసర సరుకుల సరఫరా గోదాం ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. గతేడాది నవంబర్ నుంచి జనవరి వరకు ఆయన ఈ విధులు నిర్వర్తించగా, ములకలపల్లి, అశ్వాపురం, జూలూరుపాడు, కొత్తగూడెం, పాల్వంచ, బూర్గంపాడు మండలాల్లోని 21 గిరిజన వసతి గృహాలు, ఐదు గురుకుల పాఠశాలలు, ఒక ఏకలవ్య పాఠశాలకు నిత్యావసర సరుకుల సరఫరా జరిగేది. ఈ క్రమంలో 20 రోజుల కిందట డీఎం విజయ్‌కుమార్ గోదాంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూ.3.20 లక్షల విలువైన సరుకులు లేకపోవడమే కాక, కొన్ని సరుకులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

అవకతవకలు నిజమే..


జీసీసీ గోదాంలో రికార్డుల ప్రకారం సరుకులు లేకపోవడంతో అక్రమాలు జరిగినట్లుగా గుర్తించిన డీఎం విజయ్‌కుమార్ అకౌంటెంట్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. దీంతో సంజీవరావును విధుల నుంచి తొలగిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ఎండీ క్రిస్టినా జెడ్ చోంగ్తు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని డీఎం గురువారం వెల్లడించారు. అలాగే, సరుకుల గోల్‌మాల్ వ్యవహారంపై విచారణాధికారిగా పద్మావతిని నియమించినట్లు తెలిపారు. విచారణ పూర్తయితే గోదాంలో ఎంత మేర అక్రమాలు జరిగాయో తేలనుంది. కాగా, గోదాము ఇన్‌చార్జ్‌గా ప్రస్తుత మేనేజర్ అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తుండగా, సీనియర్ సేల్స్‌మెన్‌కు బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

గతంలోనూ అక్రమాలు

లక్ష్మీదేవిపల్లిలోని జీసీసీ గోదాంలో గతంలో కూడా అక్రమాలు బయటపడ్డాయి. జీసీసీ గోదాం ఇన్‌చార్జ్‌గా వెంకటేశ్వర్లు ఉన్న సమయాన బియ్యం నిల్వల్లో తేడా రావడంతో గత ఏడాది నవంబర్‌లో ఆయనను సస్పెండ్ చేశారు. అలాగే, రూ.లక్షల విలువచేసే ముష్టిగింజలు మాయమైన ఘటనలో గోదాం ఇన్‌చార్జ్‌గా ఉన్న కృష్ణతోపాటు అప్పటి భద్రాచలం మేనేజర్ శంకర్, సేల్స్‌మెన్ వీరస్వామిపై వేటు వేశారు.

డీసీసీబీ ఆధ్వర్యాన అప్పు వసూలు

సిబ్బందిపై దాడి చేసిన యువకుడు



ముజ్జుగూడెంలో అప్పు వసూలు చేస్తున్న ఉద్యోగి

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెంలో నేలకొండపల్లి డీసీసీబీ శాఖ ఆధ్వర్యాన ఉద్యోగులు గురువారం ఆస్తుల జప్తునకు శ్రీకారం చుట్టారు. జేఎల్‌జీ రుణాల చెల్లింపుల్లో జాప్యం చేసిన పలువురికి నోటీసులు ఇచ్చినా స్పందించలేదని చెబుతూ ఉద్యోగులు గ్రామానికి వచ్చారు. అయితే, ప్రస్తుతం పరిస్థితులు బాగాలేనందున కొంత సమయం ఇవ్వాలని స్థానికులు కోరినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో 15 మంది అప్పటికప్పుడు అప్పు తెచ్చి రుణాలు చెల్లించగా, మిగతా వారి పత్తి బస్తాలు, వాహనాలను, ఇతర వస్తువులను జప్తు చేశారు. ఈ క్రమంలోనే శ్రీను అనే యువకుడి ఇంటి వద్దకు ముదిగొండ, కూసుమంచి, నేలకొండపల్లి డీసీసీబీ బ్రాంచ్‌ల సిబ్బంది చేరుకుని హడావుడి చేయడంతో ఆయన కూసుమంచి బ్రాంచ్ ఉద్యోగి నారాయణపై దాడి చేశాడు. దీంతో బ్రాంచి మేనేజర్ ఇందుతో కలిసి నారాయణ నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత సిబ్బంది మండలంలోని రామచంద్రాపురంలో జప్తు కొనసాగించారు. సొసైటీ సీఈఓలు సత్యాల కోటయ్య, వీరబాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తంతో ఎంపీ నామ పెయింటింగ్

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఫొటోను రక్తంతో పెయింటింగ్ వేయించి ఆయన పుట్టినరోజు సందర్భంగా అందజేసి ఓ వ్యక్తి అభిమానాన్ని చాటుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నామ సేవా సమితి సభ్యుడు మునిగంటి భార్గవ్ బుధవారం జరిగిన ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా తన రక్తం తీసి ఒక ఆర్టిస్ట్‌తో ఎంపీ బొమ్మ వేయించారు. గురువారం నామ సేవా సమితి సభ్యులు పాల్వంచ రాజేశ్, కృష్ణప్రసాద్ తదితరులతో కలిసి ఢిల్లీ వెళ్లి ఎంపీకి అందజేశారు.



రక్తంతో గీసిన చిత్రపటాన్ని ఎంపీకి ఇస్తున్న భార్గవ్

చేపలకూరతో విద్యార్థులకు భోజనం!



విద్యార్థులకు చేపలకూర వడ్డిస్తున్న సర్పంచ్ సంజీవయ్య

తిరుమలాయపాలెం: సాధారణంగా గ్రామాల్లోని చెరువుల్లో చేపలు పడితే ఆ రోజు ఊరంతా దాదాపు అందరి ఇళ్లలో చేపల కూర వాసన ఘుమఘుమలాడుతుంది. ఈ క్రమంలో తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు చెరువులోనూ గురువారం మత్స్యకారులు చేపలు పట్టారు. దీంతో ఎస్ఎంసీ చైర్మన్ కామళ్ల వీరయ్య సొంత ఖర్చులతో చేపలను తెప్పించి జిల్లా పరిషత్ పాఠశాలలో వండించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డించారు. సర్పంచ్ పోలెపొంగు సంజీవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చామకూరి పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వెనిగళ్ల'కు అమెరికాలో సన్మానం

ఖమ్మంసహకారనగర్: తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్న చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ల రవికుమార్‌ను తానా ఫౌండేషన్ బాధ్యులు సన్మానించారు. వాషింగ్టన్‌డీసీలో బుధవారం జరిగిన సమావేశంలో తానా ప్రతినిధులు సతీశ్ వేమన, రామ్‌చౌదరి, సాయిసుధ ఆధ్వర్యాన ఆయనను సన్మానించి మాట్లాడారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ల్యాప్‌టాప్‌లు ఇస్తుండడంతో పాటు ఫీజు చెల్లిస్తున్న రవి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెనిగళ్ల రేణుక తదితరులు పాల్గొన్నారు.



వెనిగళ్ల రవిని సన్మానిస్తున్న తానా బాధ్యులు

పెండింగ్ రహదారుల మాటేమిటి?

కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల పురోగతితో పాటు పెండింగ్ ప్రాజెక్టులపై బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మూడేళ్లలో దేశ వ్యాప్తంగా ఎన్ని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేశారు? ఇంకా ఎన్ని ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయో వెల్లడించాలని కోరారు. దీనిపై కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ప్రతిపాదనలు స్వీకరిస్తూనే ఉన్నామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, కనెక్టివిటీ అవసరాలు, నిధుల లభ్యత, ట్రాఫిక్ ఆధారంగా రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చుతామని వివరించారు.

గంజాయి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: గంజాయి రవాణా కేసులో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డానీరూథ్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2019 ఫిబ్రవరి 19న పోలీసులు ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన కేలోతు రామోజీ, భూక్యా కౌసల్యగా వారిని గుర్తించి తనిఖీ చేయగా రెండు కేజీల గంజాయి లభ్యమైంది. ఈ కేసు విచారణలో భాగంగా నిందితులపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా, రామోజీ కోర్టుకు హాజరుకాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా, కౌసల్యను పోలీసులు జైలుకు తరలించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వరరావు వాదించగా సిబ్బంది ఎం.రామకృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, ఎండీ.అయూబ్ సహకరించారు.

అటవీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం

పరిశీలించిన అధికారులు

చర్ల: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతాల్లో రహదారులు నిర్మించేందుకు గురువారం అటవీ శాఖ, రోడ్లు భవనాల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. మండలంలోని బత్తినపల్లి, రాళ్లాపురం, ఎర్రంపాడు, తిమ్మిరిగూడెం, బట్టిగూడెం, రామచంద్రాపురం, చెన్నాపురం తదితర గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి మూడేళ్ల కిందటే నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతి రాలేదు. తాజాగా అటవీ శాఖకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు లేఖ రాయడంతో ఇరుశాఖల అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. గ్రామాల్లో సుమారు 15 కి.మీ. మేర రహదారితో పాటు కలివేరు నుంచి తిప్పాపురం మీదుగా చెన్నాపురం వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి, అటవీ భూమి ఎంత కేటాయించాల్సి వస్తుందనే అంశంపై చర్చించారు. డీఎఫ్ఓ రంజిత్‌నాయక్, ఎఫ్‌డీఓ బాబు, చర్ల రేంజ్ ఆఫీసర్ ఉపేంద్ర, ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.



రాళ్లాపురంలో రహదారి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు